విద్యుత్ బిల్లుల చెల్లింపులో కొత్త నిబంధనలు

- ఆన్‌లైన్ విధానం చెల్లింపులకు వర్తింపు
- గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌లకు నో
- అధీకృత వెబ్‌సైట్/యాప్ ద్వారానే స్వీకరణ
- ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా చెల్లింపులకు అవకాశం


ఆదోనిలోని విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయం

ఆదోని అర్బన్: విద్యుత్ బిల్లులను ఇకపై నేరుగా సంస్థకే చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ప్రత్యక్ష నగదు చెల్లింపు విధానంలో ఎలాంటి మార్పులు లేనప్పటికీ ఆన్‌లైన్ విధానంలో కొన్ని మార్పులు సూచించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఎస్‌పీడీసీఎల్ సైట్ లేదా ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌లలో మాత్రమే బిల్ పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం ఇతరత్రా వాటి ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవకాశం లేదు. విద్యుత్‌శాఖ కార్యాలయానికి నేరుగా వెళ్లి కూడా చెల్లించవచ్చు.

గంటల తరబడి క్యూలైన్‌లో వేచిఉండి కరెంట్ బిల్లులు కట్టే కాలం ఈ తరంలో పోయింది. ఇటీవల ఆన్‌లైన్ వాడకం పెరిగింది. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోనే యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీస్ చార్జీలు వసూలు చేసేవారు కాదు. అయితే గతేడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో జూలై 1వ తేదీ నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్సు అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్సు పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్‌బీఐ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం బిల్ పేమెంట్ ఆప్షన్‌ను తొలగించేశాయి.

ఇదీ కారణం

ఆన్‌లైన్ చెల్లింపుల్లో థర్డ్ పార్టీ యాప్స్ అయిన ఫోన్‌పే, గూగుల్‌పే ఇతరత్రా యాప్‌ల ద్వారా బిల్లు చెల్లిస్తే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు నుంచి నాలుగు రోజులు ఆలస్యమవుతోంది. కొన్ని పేమెంట్స్ సాంకేతిక కారణాలతో నిలిచిపోతున్నాయి. అంతేగాకుండా థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్‌లో సర్వీసు నంబర్ ఇన్ఫర్మేషన్ వెళ్తుందన్న ఉద్దేశంతో ఆ యాప్‌ల ద్వారా నేరుగా నగదు చెల్లింపులు జరగకుండా ఆర్‌బీఐ చర్యలు చేపట్టింది. అయితే ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెల్లిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకి జమ అవుతుంది. ఇదే పద్ధతిలో యూపీఐ యాప్స్‌లో డబ్బు చెల్లించినా నేరుగా ఏపీఎస్‌పీడీసీఎల్‌లో నగదు జమ కావాలని ఆర్‌బీఐ సూచించింది.

75 శాతం ఆన్‌లైన్ విధానంలోనే

ఆదోని నియోజకవర్గంలో గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు 96,317 ఉన్నాయి. ఇందులో గృహాలు 76,814, కమర్షియల్ 12,028, పరిశ్రమలు 741, ప్రభుత్వ కార్యాలయాలు, ఇన్‌స్టిట్యూషన్‌లు 1220, వ్యవసాయ కనెక్షన్లు 5,834 ఉన్నాయి. అందులో 36,919 మంది ద్వారా నేరుగా చెల్లింపులు రూ.1.76 కోట్ల వరకు జరుగుతున్నాయి. 40,272 మంది ఆన్‌లైన్ ద్వారా రూ.4.96 కోట్ల నగదు చెల్లిస్తున్నారు. మొత్తం ఆదోని నియోజకవర్గం నుంచి నెలకు రూ.6.72 కోట్లు వస్తోంది. ఆన్‌లైన్ ద్వారా 75 శాతం చెల్లింపులు జరుగుతున్నాయి.

వ్యక్తిగత సమాచారం వెళ్తుందనే మార్పు



విద్యుత్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడి సమాచారం డైరెక్ట్‌గా థర్డ్ పార్టీకి వెళ్తుందన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ విద్యుత్ బిల్లుల చెల్లింపులో నూతన మార్గదర్శకాలను తీసుకొచ్చింది. ఇకపై సర్వీసు నంబర్ థర్డ్ పార్టీకి తెలియదు. విద్యుత్ వినియోగదారులు బిల్లు చెల్లింపులను డిస్కం వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలి. థర్డ్ పార్టీ యాప్స్‌లో కరెంట్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఉండదు.

– బాలచౌదయ్య, విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆదోని

సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి



ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లలో బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఉండదు. ఏపీఎస్‌పీడీసీఎల్ డిస్కమ్ పేరు కనిపించదు. కావునా ఏపీఎస్‌పీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ://ఏపీఎస్‌పీడీసీఎల్.ఇన్ వెబ్‌సైట్‌లో చెల్లించవచ్చు. ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో గానీ, డిస్కం వెబ్‌సైట్‌లో గానీ సొమ్ము చెల్లించేందుకు మాత్రం ఇతర యూపీఐ యాప్స్‌ను వాడుకోవచ్చు. అలాగే డెబిట్, క్రెడిట్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుతూ బిల్లులు చెల్లించవచ్చు.

– పురుషోత్తం, విద్యుత్‌శాఖ ఏడీఈ, ఆదోని

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న పురపాలక ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సి.నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సీనియర్ నాయకుడు నిరంజన్ అధ్యక్షతన శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో ఉపాధ్యాయులకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు, ఏపీజీఎల్ఐసీ, జీపీఎఫ్ రుణాలు, పండుగ అడ్వాన్స్‌లు వంటివి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, 30 శాతం కరువు భత్యం ప్రకటించాలని కోరారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్టీయూ నాయకులు రవి, భీమరాజు, ప్రసాద్, రాజు, సతీష్, మారయ్య, విజయ్ కుమార్, గురురాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణే లక్ష్యం

ఆదోని టౌన్: సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా ఆదోని మున్సిపాలిటీలోని వార్డులు, సందుల్లో మురుగు కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నారు. ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకుతుండడంతో ఎంఎల్ ఆయిల్‌ను కాలువలపై స్ప్రేయింగ్ మిషన్ల ద్వారా పిచికారీ చేస్తున్నారు. ఆదోని మున్సిపాలిటీలోని 42 వార్డులు, మురుగువాడలు, శివారు ప్రాంతాల్లో ఈ నెల 1వ తేదీ నుంచి ఎంఎల్ ఆయిల్ లిక్విడ్‌ను స్ప్రే చేస్తున్నారు. కాలువలు, చెట్లు, ఓవర్‌బ్రిడ్జిల కింద తదితర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం రెండుపూటలా పురుగు మందును స్ప్రే చేస్తున్నారు. 45 లీటర్ల ఎంఎల్ ఆయిల్ లిక్విడ్‌ను కొనుగోలు చేశామని, సందుసందునా మందును పిచికారీ చేసి దోమలను నియంత్రించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ తెలిపారు. ఒక్కో వార్డులో ఒక్కో శానిటరీ వర్కర్‌ను స్ప్రేయింగ్ కోసమే ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

వేలం పాటలు వాయిదా


వేలం నిర్వహించేందుకు సమావేశమైన అధికారులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఒక సంవత్సరం పాటు టెంకాయలను సరఫరా చేసేందుకు, కొబ్బరి చిప్పలను పోగు చేసుకొనే హక్కుల కోసం శుక్రవారం నిర్వహించ తలపెట్టిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. ఈ వేలం పాటను ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్ తెలిపారు. దీంతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమానికి కూరగాయల సరఫరా, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, పాదరక్షల స్టాండ్ నిర్వహణ కోసం టెండర్లు, స్వామి వారికి నిత్య పూజల కోసం పూలు, అగర్‌బత్తిలు సరఫరా చేసేందుకు నిర్వహించిన వేలాలకు కూడా పాటదారులు ముందుకు రాకపోవడంతో వీటిని కూడా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. టెంకాయల వేలం పాటకు రామన్నగౌడ్ రూ.75 లక్షలకు సీల్డ్ టెండరు వేసినప్పటికీ నిబంధనల ప్రకారం డబ్బు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 20న అన్ని వ్యాపారాలకు సంబధించి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. వేలం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ, ఆదోని ట్రాఫిక్ సీఐలు ఏరిషావలి, మంజునాథ్, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గట్టి పోలీసు బందబస్తు ఏర్పాటు చేశారు.


ఎరువుల దుకాణాల తనిఖీ


ఫర్టిలైజర్స్ షాపులో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ వి.హనుమంతరావు, విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. శ్రీ భీమేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో స్టాక్ బుక్‌లోని వివరాలకు ఈ పాస్ మిషన్‌లో పొందుపరిచిన నిల్వల్లో తేడాలు ఉండడంతో రూ.5,88,520 విలువల గల రసాయన ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భువనేశ్వరి సీడ్స్ దుకాణంలో రూ.22,61,941 విలువల గల రసాయన ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వారు చెప్పారు. అలాగే భువనేశ్వరి సీడ్స్ సెంటర్‌లో రూ.2,46,240 విలువగల బీటీ పత్తి విత్తనాలను, గీత హైబ్రిడ్ సీడ్స్‌లో రూ.1,07,700 విలువైన కూరగాయల విత్తనాల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే నవత ట్రాన్స్‌పోర్టు, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టుల్లో తనిఖీలు నిర్వహించారు. ఏఓ అశోక్‌కుమార్ రెడ్డి, ఏడీఏ అరుణకుమారి పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఏజెన్సీస్, మంజునాథ ట్రేడర్స్, వాసవీ ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆదోని ఏడీఏ అరుణకుమారి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పల్నాడు ఏడీఏ వి.హనుమంతరావు తనిఖీ చేశారు. మంజునాథ దుకాణంలో మిరప విత్తనాలకు సంబంధించిన స్టోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో రూ.6,81,120 విలువ చేసే విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. ఏఓ రాజు వెంట ఉన్నారు.

ఘనంగా మట్టెద్దుల పండుగ


ఎద్దుల ప్రతిమలతో చిన్నారుల సందడి

కోసిగి: మండల కేంద్రంలో మట్టెద్దుల అమావాస్యను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మట్టితో ఎద్దుల ప్రతిమలను తయారు చేసి విశేష పూజలు చేపట్టారు. ఉదయం నుంచి చిన్నారులు కుమ్మరి కులస్తుల ఇళ్ల వద్దకు క్యూ కట్టారు. మట్టితో తయారు చేసిన ఎద్దుల ప్రతిమలను చిన్న సైజు రూ.20 నుంచి రూ.50 వరకు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లారు. ఇంటి వద్ద ఎద్దుల ప్రతిమలను రంగులతో ముస్తాబు చేసి పూజలు చేశారు. కడపాళెంలోని కాశమ్మ గడ్డ, చింతలగేని వీధి, దుర్నిగేని వీధి, కింద మారెమ్మ దేవాలయం కాలనీ, నాగన్న కట్ట కాలనీ నుంచి చిన్నారులు ఎద్దుల ప్రతిమలను అట్టలు, తోపుడు బండిపై కొలువుంచి డప్పు వాయిస్తూ కడపాళెం వీధిలో ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి కలశాలతో పురవీధుల గుండా ఎద్దుల ప్రతిమలను ఊరేగించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు పడుతున్న కష్టాలను తీర్చాలని దేవుడిని వేడుకున్నారు. అనంతరం కాశమ్మ గడ్డ కాలనీలో చిన్నారులు ఎద్దుల ప్రతిమలను పట్టుకుని పరుగు పందెం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.


కామవరంలో ఎద్దు ప్రతిమ ఊరేగింపు

కౌతాళం: మండలంలో శుక్రవారం మట్టి ఎద్దుల అమావాస్య వేడుకలను వైభవంగా నిర్వహించారు. మట్టితో తయారుచేసిన ఎద్దులను గ్రామ పురవీధుల గుండా బ్యాండు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కౌతాళంలోని హనుమాన్‌నగర్, మండల పరిధిలోని కామవరం, లింగాలదిన్నె, నదిచాగి గ్రామాల్లో వేడుకలను రైతులు ఘనంగా నిర్వహించారు.

ఉపాధి పనుల్లో అవినీతి బట్టబయలు


విచారణ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఉపాధిహామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో బట్టబయలు అయ్యింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనం ఆవరణలో 17వ సోషల్ ఆడిట్ బహిరంగ సమావేశం నిర్వహించగా డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి హాజరయ్యారు. మండలంలోని 16 పంచాయతీల్లో ఉపాధిహామీ పనుల్లో కూలీలకు రూ.10,30,17,645 ఖర్చు చేయగా, మెటీరియల్‌కు రూ.7,43,80,257 చెల్లించారు. మొత్తం రూ.17,73,97,902 ఖర్చు చేశారు. ఈ పనులపై వారం రోజుల పాటు ఒక ఎస్సార్పీ, 7 మంది డీఆర్పీలు గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం సభ్యులు విచారణ జరిపి, గ్రామ సభలు నిర్వహించి చేసిన ఖర్చులు, జరిగిన అవినీతిపై వివరాలు సేకరించి రూ.2,24,798 అవినీతి జరిగినట్లు శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ బహిరంగ సమావేశంలో బయటపెట్టారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సోషల్ ఆడిట్‌లో ఎక్కువగా ఏ గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందో అటువంటి జీపీలను చూస్తున్న ఎఫ్ఏ, టీఏలపై విచారించి అక్రమాలు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పనులు చేపట్టాలని చెబుతున్నా, ఎక్కడో ఒక చోట నిధులు దుర్వినియోగం అవుతున్నాయని దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కడిమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కువగా నిధులు దుర్వినియోగం అయినట్లు ఆడిట్‌లో బయట పడిందని చెప్పారు. కడిమెట్ల జీపీలో రూ.1,93,898 రికవరీతో పాటు, రూ.7,500 పెనాల్టీ విధించినట్లు తెలిపారు. మండలంలోని 16 పంచాయతీల్లో మొత్తం మీద రూ.2,06,298 రికవరీకి, రూ.18,500 పెనాల్టీ కింద చెల్లించాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్లాంటేషన్ పనుల్లో 50 శాతం కూడా పూర్తి చేయని ఏపీఓ, టీఏ, ఎఫ్ఏలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సక్రమంగా పనిచేయని ఫీల్డు అసిస్టెంట్లను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, రాజకీయ తొలగింపులు ఉండవని చెప్పారు. ఉపాధిహామీ పని దినాల పూర్తి కోసం ఇంకా కొద్ది రోజులు సమయం ఉందని, పనులు పూర్తి చేయని టీఏ, ఎఫ్ఏలు తమ టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ కేశన్న, ఏపీడీ అల్లీపీరా, డీవీఓ విజయభాస్కర్, క్వాలిటీ కంట్రోల్ అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీఓ విజయమోహన్, ఏఆర్పీ, డీఆర్పీలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఫ్ఏలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

టీఏ, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

ఎమ్మిగనూరురూరల్: ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ కావడంతో అందుకు బాధ్యులైన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టీఏను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఏపీఓ విజయమోహన్ తెలిపారు. కడిమెట్ల పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉరుకుందు, గుడేకల్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ దేవశంకరయ్యను సస్పెండ్ చేశారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. శుక్రవారం అమావాస్య కావడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు ఎటు చూసినా భక్త జనసంద్రంగా కనిపించాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోల వారు ప్రత్యేక బస్సులను నడిపారు.

అలాగే ఉరుకుందకు 5 కి.మీ. దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయానికి, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రా వాటర్ పంపింగ్ పనుల పరిశీలన

ఆదోని టౌన్: రాంజల నల్లచెరువు నుంచి కలుషిత నీటిని బయటికి పంపింగ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పనులను శుక్రవారం సాయంత్రం ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ బోయ శాంత పరిశీలించారు. వీలైనంత త్వరగా రా వాటర్‌ను బయటికి పంపింగ్ చేసి వర్షాలు కురిసినప్పుడు వచ్చే నీటితో నింపుతామని వారు వెల్లడించారు.

తెగుళ్ల నివారణతోనే మంచి దిగుబడులు


మాట్లాడుతున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రి

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు సాంకేతిక సూచనలు, సలహాలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. వారు శుక్రవారం గోనెగండ్లలో మాట్లాడుతూ.. జూన్ నెలలో వర్షాలు కురవడంతో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, మిరప, ఉల్లి పంటలను రైతులు సాగు చేశారన్నారు. ప్రస్తుతం రసం పీల్చే పురుగులు (పచ్చదోమ, తామర, పేను బంక), మెగ్నీషియం దాతు లోపాలు ఆశించి పైర్లకు నష్టం కలగచేస్తున్నట్లు గమనించామని చెప్పారు. రసం పీల్చే పురుగు నివారణకు వేపనూనె 1000 పీపీఎం ఎకరానికి 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే ఎకరానికి 25 పసుపు, 25 నీలి రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేయాలి. అవసరాన్ని బట్టి రసాయన పురుగు మందులు ఎకరానికి ఇమిడాక్లోప్రిడ్ 40 మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 40 గ్రాములు లేదా థయోమిథాక్షమ్ 40 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే పత్తి పంటలో మెగ్నీషియం దాతు లోపం ఆశించినట్లు గమనించామన్నారు. ఆకులన్నీ పింక్ రంగులో ఉన్నట్లు గుర్తించమన్నారు. మెగ్నీషియం దాతులోప నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. గులాబీ రంగు పురుగు నివారణకు వేప నూనె 1000 పీపీఎం ఎకరానికి 400 మిల్లీ లీటర్లు పిచికారీ చేసుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టలు ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఈ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వివాహిత ఆత్మహత్య

మంత్రాలయం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర పురానికి చెందిన ఓ వివాహిత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. మంత్రాలయానికి చెందిన రాము, నాగమ్మ దంపతుల కుమార్తె పద్మావతి (22)ను అదే గ్రామానికి చెందిన మేనమామ సెంట్రింగ్ పనిచేసుకునే వీరేష్‌కు ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి దంపతుల మధ్య చిన్న గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన పద్మావతి ఉదయం తుంగభద్ర నదిపై ఉన్న రైలు బ్రిడ్జిపైకి చేరుకుంది. దాదాపు 1 గంట సమయంలో రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడింది. కర్ణాటకలోని రాయచూరు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు రాబట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

బస్సు టైర్ పేలి ఒకరికి తీవ్రగాయాలు

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి–ఎర్రకోట గ్రామాల మధ్య ప్రయాణిస్తున్న బస్సు వెనక టైరు ఒక్కసారిగా పేలడంతో బస్సులో కూర్చొన్న ఉస్మాన్ అనే ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. స్థానిక ఎంఐజీ కాలనీకి చెందిన ఉస్మాన్ పని నిమిత్తం కర్నూలుకు వెళ్లి తిరిగి ఆదోనికి బస్సులో వస్తున్నాడు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి–ఎర్రకోట గ్రామాల మధ్య వెళ్తుండగా అకస్మాత్తుగా బస్సు వెనుక చక్రం పేలిపోయింది. పేలుడు తీవ్రతకు బస్సులో కూర్చొన్న ప్రయాణికుడు ఉస్మాన్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఉస్మాన్‌ను మరో బస్సులో ఆదోనికి పంపించడంతో బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి రక్తం గడ్డ కట్టిందని, నడవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని జుమ్మాలదిన్నె గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. శుక్రవారం అమవాస్య కావడంతో కోసిగి, జుమ్మాలదిన్నె గ్రామాల మీదుగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం భక్తుల రద్దీ కొనసాగుతోంది. కోసిగి మండలం సాతనూరు గ్రామానికి చెందిన వీరేంద్ర, హరి అనే యువకులు స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా అయిజకు చెందిన సిద్దు బైక్‌పై స్వామి వారి దర్శనార్థం వెళుతుండగా జుమ్మాలదిన్నె సమీపంలో బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి కాళ్లు , చేతులు, శరీర భాగాలకు రక్త గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఆదోని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు రెఫర్ చేశారు.

క్లుప్తంగా

జిల్లా కలెక్టర్‌ను కలిసిన దూదేకుల నాయకులు


జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో ఆదోని దూదేకుల సంఘం నాయకులు

ఆదోని రూరల్: దూదేకుల సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ బాబన్, ఆదోని సాయిబాబా, కర్నూలు జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా తదితరులు శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్‌కు శాలువా, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి, దూదేకుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రాలయంలోని ప్రైవేటు లాడ్జీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో సరికొత్త సంస్కరణలు తెస్తున్నారన్నారు. ప్రజలకు ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తెచ్చామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పన్నగ వెంకటేష్, నాయకులు కృష్ణమోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దంపతులకు గాయాలు

నందవరం: అమావాస్య సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లి వస్తూ దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం అయిజ మండల కేంద్రానికి చెందిన నవదంపతులు ప్రసాద్, నరసమ్మ శుక్రవారం కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి బైక్‌పై వచ్చారు. దర్శనం చేసుకుని తిరిగివెళ్తుండగా నందవరం మండలం గంగవరం గ్రామం వద్ద ప్రమాదానికి గురయ్యారు. బైకుపై వెళ్తున్న దంపతులను ట్రాక్టర్ వేగంగా వస్తూ ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతుల కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అక్కడినుంచి కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు.

జీఓ 117ను రద్దు చేయాలి

కోసిగి: రాష్ట్రంలో ప్రాథమిక విద్యను విచ్ఛిన్నం చేస్తున్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం కోసిగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే యూటీఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు.ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లప్ప, మండల అధ్యక్ష, కార్యదర్శులు చిన్న ఈరన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి


పెద్దకడబూరు: మండలంలో 6 సంవత్సరాల్లోపు చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ (ప్రీ స్కూల్) కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ విజయకుమారి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ ఉడ్ కేర్ అండ్ డెవలప్‌మెంట్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆటలు, పాటలు, బొమ్మలు వేయడం వంటి వాటితో చిన్నారులను ఆకట్టుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించడానికి ముందు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరారు. దీనివల్ల పిల్లలకు పాఠశాల అంటే భయం పోతుందని చెప్పారు. పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శుక్రవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రంలోని బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామికి శుక్రవారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజామున జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకుపూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి పూజలు చేశారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.